

ఉన్నతి లేని 'ఉన్నతి'!

- అర్హులైన మహిళా సంఘాలకు అందని రుణాలు
- అమలులో జిల్లా ప్రథమం..ఎస్‌ఆర్ పురం అధమం
- అధికారుల నిర్లక్ష్యమే కారణం?
- అర్హుల నిరీక్షణ

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ ద్వారా ఏర్పాటు చేసిన 'ఉన్నతి' పథకం అమలులో చిత్తూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో వుంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉన్నతి అమలులో మండలం అధమ స్థానంలో వుంది. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించినా మళ్లీ రుణాలు తిరిగి ఇవ్వడం లేదని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతిలేని 'ఉన్నతి'!

2013వ సంవత్సరంలో ఉన్నతి పథకం రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ కింద ప్రారంభించింది. ఇది మహిళల అభివృద్ధికి ఉద్దేశించి ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్ ప్లాన్ చట్టం చేశారు. ఇందులో మహిళలు, స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతి మహిళా అర్హురాలు.. ఇందులో లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణం ప్రభుత్వం నిర్దేశించింది. దీని ప్రకారం అధికారులు దశలవారీగా నిర్ణయించి ప్రతి నెల వారి దగ్గర తిరిగి వసూలు చేస్తున్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎస్‌ఆర్‌పురం మండలంలో ఇలాంటి రుణాలు అందిస్తారని తమకు ఇప్పటి వరకు తెలియదని చాలా మంది అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. 2014 నుంచి అమలు అవుతున్న ఈ పథకం ద్వారా రుణాలు స్వీకరించిన కొద్ది మంది మహిళలు సక్రమంగా చెల్లిస్తున్నారు. లబ్ధిదారులు చెల్లించిన రుణాల బకాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పై స్థాయికి చేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఈ పథకం ద్వారా రుణాలు ప్రస్తుతం అందించడం లేదని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

మహిళా సంఘాలకు అందని రుణాలు

ఈ 2025-26 సంవత్సరానికి ఇప్పటి వరకు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాలలో ఉన్నతి లోన్లు అందలేదు. దీనికి తగినట్లే మండలాలలో పని చేస్తున్న సిబ్బంది కూడా చొరవ చూపించడం లేదు. ఆర్థికంగా బలంగా లేని తమకు రుణాలు ఇస్తే తిరిగి చెల్లించలేమనే సందేహం అధికారుల్లో వుండటం వల్లే ఏమాత్రం ఉన్నతి రుణాలు అందించడం లేదని అర్హులైన ఎస్‌సి సామాజిక వర్గాల మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. తాము అంటేనే అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ , శ్రీనిధి సిఐఎఫ్ సామాజిక పెట్టుబడి నిధి రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న తమకు వడ్డీ లేని ఉన్నతి రుణాలు మంజూరు చేస్తే తిరిగి ఎందుకు చెల్లించమని వారు ప్రశ్నిస్తున్నారు. 2025 -26 సంవత్సరానికి ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని వారు అధికారులను నిలదీస్తున్నారు. పైస్థాయి అధికారులు దీనిపై స్పందించాలని కోరు తున్నారు.

అమలులో జిల్లా ప్రథమం..ఎస్‌ఆర్ పురం అధమం..

ఉన్నతి రుణాల అమలులో జిల్లాలోనే అధ్వానంగా చివరి స్థానంలో ఎస్‌ఆర్‌పురం, వెదురు కుప్పం వున్నాయి. చిత్తూరు జిల్లాలోనే గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెనుకబడి వుంది. అందులో ఎస్‌ఆర్ పురం, వెదురుకుప్పం మండలాలు చివరి స్థానం లో ఉన్నాయి. ఎస్‌ఆర్ పురం మండలంలో వెలుగు సిబ్బంది నిర్వాకంతో ఈ పథకం అధ్వానంగా మారింది. అర్హులను గుర్తించడంలో, ఎస్సీ ఎస్టీల గ్రూపులపై శ్రద్ధ లేకపోవడం, కింది స్థాయి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించక పోవడంతో మండలం జిల్లాలోనే చివర స్థాయిలో నిలిచింది. ఎస్‌ఆర్ పురం మండలంలో 556 ఎస్‌సి గ్రూపులు, 34 ఎస్‌టి గ్రూపులు ఉన్నాయి. వీటిలో 90 శాతం మందికి ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ గురించి గానీ, ఉన్నతి పథకం గురించి, నిధులు గురించి తెలియక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. సంఘంలో అప్పు తీసుకుని తిరిగి చెల్లించని సంఘానికి మాత్రమే రుణం తిరిగి పొందే అర్హత ఉండదు. సంఘంలో అప్పు తీసుకొని కడుతూ ఉంటే మిగిలిన సభ్యులు తిరిగి రుణం పొందడానికి అర్హత వుంటుంది. అయితే ఇంతవరకూ రుణాలు చెల్లించిన వారికి సైతం ఉన్నతి రుణాలు మంజూరు చేయలేదని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా కాకి లెక్క

మండలంలో వివోల నిధులు, అప్పుల లెక్కలు కాకి లెక్కలుగా మారాయని పలువురు వాపోతున్నారు. మండల డేటాలో బకాయిలు ఉన్న సంఘాల వద్దకు వెళితే తాము తీసుకున్న లోన్లు తిగిరి చెల్లించామని బకాయిలు లేవని అంటున్నారు. రికార్డుల్లో సభ్యులపై లోపం చూపుతూ రికవరీ డబ్బులు జమ చేయక ఈ డబ్బులు ఏమయ్యాయో అధికారులకే తెలియాల్సి వుందని పలువురు పేర్కొంటున్నారు. రికవరీ శాతం సక్రమంగా లేకపోవడంతో ఉన్నతి అమలుకు నోచుకో లేదని మండల స్థాయి అధికారులు తెలిపారు.

మండలంలో నలుగురికే 'ఉన్నతి'

మండలంలో ఉన్నతి పథకంలో నలుగురికే లోన్ ఇచ్చినట్లు జిల్లా రికార్డుల్లో వుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉన్నతి పథకం మండలంలో పూర్తి స్థాయిలో అమలు కాకపోవడానికి కారణాలు జిల్లా స్థాయి అధికారులే తేల్చాల్సి వుంది.

స్త్రీ ఉన్నతంగా ఎదగాలి



కనీసం పిల్లలకు కూడా స్కూలు ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఎన్నో ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు ఉన్నా యి. ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ ద్వారా డ్వాక్రా గ్రూపులో అర్హులైన లబ్ధిదారుల కోసం ప్రతిష్టాత్మకమైన ఉన్నతి పథకం తీసుకొచ్చింది. జిల్లాకు 17 కోట్లు రూపాయలు కేటా యిం చారు. జిల్లా యంత్రాంగం సిబ్బంది కృషితో ఉన్నతిపై పాత బకాయి నిలిచిపోవడంతో ప్లానింగ్, అవగాహన నిర్వహించి రికవరీలో 83 శాతం పెరగడంతో నవంబరు కల్లా 17 కోట్లను 20,165 మంది అర్హులైన సభ్యులకు అందించి లక్ష్యం పూర్తి చేశాం.. జిల్లాలో అర్హులైన అభ్యర్థుల లోన్ రిక్వెస్ట్ మేరకు అదనంగా రూ.10 కోట్లు తీసుకొచ్చాం.. అర్హులందరికీ ఉన్నతి లోన్లు ఇస్తాం..జిల్లాలోనే పూతల పట్టు మండలం 344 మందితో ప్రథమ స్థానంలో, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం 16, ఎస్‌ఆర్‌పురం నలుగురికే పరిమితమై చివరి స్థానం లో వుంది. ఈ రుణాలను ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలి..

- శ్రీదేవి, చిత్తూరు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్.

కామ్రేడ్ మునెమ్మ అమర్‌రహే..!

సిపిఎం, ప్రజాశక్తి సిబ్బంది నివాళి



మునెమ్మ ఫైల్‌ఫొటో, సిపిఎం నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్యకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య అంగేరి మునెమ్మ(54) గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. రాజీవ్ నగర్‌లోని పుల్లయ్య నివాసం నుండి మునెమ్మ అంత్యక్రియలు నిర్వహించగా, సిపిఎం శ్రేణులు నివాళి అర్పించి, అండగా నిలిచాయి. తిరుపతి జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మునెమ్మ మృతదేహంపై ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు. మునెమ్మ అమర్ రహే అంటూ నినదించారు. అనంతరం పుల్లయ్యకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్ధన్, పెనగడం గురువయ్య, రెడ్డిపల్లి సురేష్, గెడి వేణు, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు మునెమ్మకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

■ సిఐటియు సంతాపం..

సిఐటియు శ్రేయోభిలాషి, ప్రజాతంత్ర ఉద్యమ నాయకురాలు సిఐటియు నేత అంగెరి పుల్లయ్య సతీమణి అంగేరి మునెమ్మ హఠాన్మరణానికి సిఐటియు రాష్ట్ర -పాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మునెమ్మ మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి వారి కుటుంబ సభ్యులకు తీవ్ర లోటుగా పేర్కొన్నారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు .

■ పాడె మోసిన కూతుళ్లు..

త్యాగమూర్తి, ఆదర్శ మహిళ మునెమ్మ పాడెను తండ్రి అంగేరి పుల్లయ్యతో కలిసి ముగ్గురు కూతుళ్ల మోశారు. పెద్ద కుమార్తె దివ్య, రెండో కుమార్తె హేమలత, మూడో కుమార్తె వాణిలు తల్లి పాడెను మోస్తూ విప్లవ నినాదాలు చేశారు. వీరితో పాటు మునెమ్మ మనుమళ్లు, మనుమరాళ్లు కూడా పాడె మోసి అంతిమయాత్ర వరకు కొనసాగారు. మునెమ్మది చివరి మజిలీ అయినా ఆమె ఆశయాలు మాలో బతికే ఉన్నాయని చాటి చెప్పారు. మునెమ్మ కోరిక మేరకు పార్టీ పద్ధతుల ప్రకారం అంతిమయాత్ర నిర్వహిస్తున్నామని భర్త అంగేరి పుల్లయ్య వెల్లడించారు. పెద్ద కుమార్తె దివ్య ప్రజాశక్తిలో సీనియర్ సబెడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త వాడ గంగరాజు చిత్తూరు జిల్లా సిపిఎం కన్వీనర్‌గా ఉన్నారు. మొదటినుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి తమ కుటుంబం ఉందని దివ్య అన్నారు.

■ ప్రజాశక్తి నివాళి..

మునెమ్మ మృతదేహానికి ప్రజాశక్తి కుటుంబం నివాళి అర్పించింది. సబెడిటర్ దివ్యను ఓదార్చింది. ప్రజాశక్తి మేనేజర్ సిఎస్ ప్రసాద్, బ్యూరో ఇంచార్జి వళిగలం గోపి, డెస్క్ ఇంచార్జి అవనిగడ్డ వనజ, జిల్లా ఇంచార్జి శ్రీనివాసులు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి సురేష్, డివిజన్ ఇన్‌ఛార్జి కిషోర్, విలేకరులు కామేష్, వెంకటేష్ ఉన్నారు.

అల్లుకున్న ప్రమాదం!

- విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగలు
- పట్టించుకోని అధికారులు



విద్యుత్ స్తంభాలను, తీగలను చుట్టుముట్టిన తీగలు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): మండలంలో పలుచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ తీగల పైకి చెట్ల తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదం పొంచి వున్నా అధికారులు చూసీ చూడనట్లు వెళ్లిపోతున్నారు. ఈ స్తంభాల దగ్గరకు ఆదమరిచి పశువులు, పిల్లలు సమీపానికి వెళితే విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయం తప్పదని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

టీటీడీలో అక్రమాలను వదిలిపెట్టం

- వైసిపి అవినీతిలో వాటాలు
- తిరుపతి గరుడ వారధి నిర్మాణంలోనూ కమిషన్
- తిరుమలలో వైకుంఠ దర్శనానికి సకల ఏర్పాట్లు
- టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం



మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు శాంతారాం

ప్రజాశక్తి -కుప్పం : వైసిపి హయంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అవినీతిలో అప్పటి సీఎం జగన్‌కు వాటాలు ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదని టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్ కుప్పంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. కుప్పం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తిరుమలలో వైకుంఠ దర్శనానికి సకల ఏర్పాట్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30,31, జనవరి ఒకటో తేదీన ఈ డిప్ ద్వారా టోకెన్లు పొందిన 1.86 లక్షల మందికి వైకుంఠ ఏకాదశి దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం పేర్కొన్నారు. కొంతమంది పనికట్టుకుని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొండపైకి భక్తులను రావద్దనే హక్కు ఎవరికీ లేదని, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈడిప్ ద్వారా 1.86 లక్షల మందికి వైకుంఠ దర్శనం

తిరుమలలో వైకుంఠ ద్వారం దర్శనం కోసం టిటిడి నిర్వహించిన ఈడిప్ కు సుమారు 20 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా వారిలో 1.86 లక్షల మందికి డిసెంబర్ 30, 31, జనవరి ఒకటవ తేదీల్లో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేదీ వరకు 180 గంటలు ఉంటే అందులో 166 గంటలు సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించే విధంగా టీటీడీ చర్యలు తీసుకుందన్నారు.

కొండపైకి రావద్దు అనే హక్కు ఎవరికి లేదు

తిరుమల వైకుంఠ దర్శనం సందర్భంగా గతంలో చోటుచేసుకున్న ఘటనలు మరల పునరావృతం కాకూడదని ఈడిప్ ద్వారా ఎంపిక చేసి వారికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించడం జరుగుతుందని, అయితే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని తిరుమలకు భక్తులను రావద్దని హక్కు ఏ ఒక్కరికి లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో జరిగిన ఘటనలు మరల పునరావతం కాకూడదని రెండుసార్లు టీటీడీ బోర్డు సమావేశం ఏర్పాటు చేసి తీసుకున్న నిర్ణయం మేరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నామన్నారు.

3000 మందితో పోలీస్ కమాండ్ కంట్రోల్

వైకుంఠ ద్వార దర్శనం కోసం మూడు వేల మంది పోలీసులతో కమాండ్ కంట్రోల్ పెట్టి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతరమ్ తెలిపారు. ఐదు లక్షల అదనపు లడ్డూలను సిద్ధం చేస్తామని వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుపతి శ్రీ గోవిందరాజుల స్వామి ఆలయ గోపుర తాపడం లో 50 కేజీల బంగారాన్ని స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. 100 కేజీలతో 9 లేయర్లుగా తాపడం చేయాల్సి ఉండగా కేవలం రెండు లేయర్లు తాపడం చేసి 50 కేజీల బంగారాన్ని స్వాహా చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరుమల వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లపై టిటిడి బోర్డు ద ృష్టి పెట్టిందని పూర్తయిన తర్వాత వైసిపి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

జాతీయ స్కయ్ పోటీలకు12 మంది ఎంపిక



ప్రజాశక్తి -పుంగనూరు: స్కయ్ అంటే కాశ్మీర్‌కు చెందిన ఒక పురాతన యుద్ధ కళ అని ఇది కత్తి, డాలుతో పాటు పోరాట నైపుణ్యాలు నేర్పుతుందని చిత్తూరు జిల్లా స్కయ్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం అన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిని పుంగనూరు ఇండియన్ మార్షల్ అకాడమీ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ జాతీయ స్థాయి స్కయ్ పోటీలు హైదరాబాద్ లో జనవరి 5,6,7వ తేదీలలో నిర్వహిస్తామన్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు చిత్తూరు జిల్లా నుండి 12 మంది ఎంపికయ్యారని తెలిపారు. చిత్తూరుకు చెందిన స్రవంతి, నూరేజ్, యతేంద్ర, ముస్తకిన్, అభిలాష్, ఉమర్, ఆదిల్, తోఫిక్, తో పాటు పుంగనూరు పట్టణానికి చెందినవారు నలుగురు ఆసిఫ్, ఫారుక్, సాద్, ఆ ఫీన్ ఎంపిక అయ్యారని వారిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కయ్ చిత్తూర్ జిల్లా సభ్యుడు ఎస్ అయూబ్, ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ మన్సూర్, చిత్తూరు మాస్టర్ ఉమర్, కర్ణాటక కోలారు జిల్లా స్కయ్ ఇన్ చార్జ్ వహీద్, స్కై అధికారిక సభ్యులు అయూబ్ బాషా పాల్గొన్నారు.

వేడుకగా క్రిస్మస్..

ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గమని ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం సమాజంలో మరింత పరిఢవిల్లాలని వారు ఆకాంక్షిం చారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పలు చర్చిలలో నిర్వహించిన కిస్మస్ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు పంచిపెట్టారు. క్రైస్తవ సోదరులు ప్రార్థనలు చేశారు. చర్చిలను అందంగా అలంకరించి ఆనందంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు..



పుంగనూరు చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

'ఐలు' చిత్తూరు జిల్లా కమిటీ రద్దు

■ తొమ్మిది మందితో కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, చిత్తూరు జిల్లా కమిటీ ఏర్పాటు అయినప్పటినుంచి ఇప్పటివరకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన కార్యక్రమాలు నిర్వహించడంగానీ, స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించడంగానీ లేని కారణంగా ఆ కమిటీని రద్దు చేస్తూ ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో తీర్మానించినట్లు ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం కార్యకలాపాలకు ఆటంకం జరగకుండా ఉండేందుకు, త్వరలో జరగనున్న బార్ కౌన్సిల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు తొమ్మిది మందితో కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరుపతి నుండి పత్తికొండ మురళి, హేమచంద్ర రెడ్డి, చల్లా వెంకటయ్య, భాను చందర్, మదనపల్లి నుండి షాజహాన్ భాష, పివీ ప్రసాద్, సోమశేఖర్, చిత్తూరు నుండి సుగుణ శేఖర్ రెడ్డి, శ్రీకాళహస్తి నుండి అంకయ్యలు సభ్యులుగా ఉంటారని ఐలు రాష్ట్ర కార్యదర్శి వర్గం తీర్మానించినట్లు తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక జరిగే వరకు ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా పి.హేమచంద్ర రెడ్డి, కన్వీనర్‌గా పత్తికొండ మురళి వ్యవహరిస్తారన్నారు. ఎపి బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థి సత్తు అంకయ్యకు తప్ప మరో అభ్యర్థికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఎవరి మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అభ్యర్థి సత్తు అంకయ్యకు ఐలు కార్యకర్తలు, న్యాయవాదులు తమ ప్రాధాన్యత ఓటును వేసి ఆయన గెలుపుకు సహకరించాలని మాధవరావు విజ్ఞప్తి చేశారు.

సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల 26న శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి పాల్గొననున్న సంస్కృత విద్యాపీఠం, డిస్ట్రిక్ పోలీస్ ఆఫీస్ వద్ద ఏర్పాట్లను, ముఖ్యమంత్రి వెళ్లే మార్గాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు లేకుండా పూడ్చాలని, డివెడర్లకు రంగులు వేయాలని తెలిపారు. డివెడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేయాలని, రోడ్లపైన మట్టి లేకుండా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలరని సూచంచారు. అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో కేటాయించిన విధులను వారు అప్రమత్తంగా, బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. కమిషనర్ వెంట టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్ పాల్గొన్నారు.

నేడు తిరుపతికి రానున్న చంద్రబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉదయం 8.10 గంటలకు ఉండవల్లి నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ఉదయం 9:35 గంటలకు తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి బయలుదేరి ఉదయం 10.05 గంటలకు సంస్కృత విద్యాపీఠానికి చేరుకుని 12 గంటల వరకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం 1.35 గంటలకు బైరాగి పట్టెడ లోని (మీడియా కోఆర్డినేటర్) శ్రీధర్ వర్మను తన గృహంలో కలవడానికి వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమ అనంతరం 2.05 గంటలకు ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని ఉండవల్లికి తిరిగి ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పెందుర్తిని కలిసిన డాలర్స్ దివాకర్‌రెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తిరుపతికి విచ్చేసిన సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌ను తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.

కుప్పంలో క్షీర విప్లవం..

- 10 లక్షల లీటర్ల లక్ష్యం
- ఏవైనా సమస్యలు వుంటే తెలపాలి
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి -కుప్పం : కుప్పం నియోజకవర్గంలో 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి టార్గెట్గా పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3.5 లీటర్ల పాల ఉత్పత్తి ఉంటే ఏడాదిన్న కాలంలో దాన్ని 4.59 లక్షల లీటర్లకు పెంచామని, మరో రెండేళ్లలో 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి చేస్తామన్నారు. 50 శాతంరాయితీతో రైతులకు ధాణా ఇస్తున్నామన్నారు. కుప్పం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని ఇక్కడి నిరుద్యోగ యువత కు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. జనవరిలో కంగుందిలో అంతర్జాతీయ స్థాయిలో బౌల్డరింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు గౌరవాన్ని దెబ్బతీసే ఏ అంశాన్ని టిడిపి నాయకత్వం ప్రోత్సహించదని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ పేర్కొన్నారు వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ వైసిపి హయంలో రాష్ట్రంలో అరాచకాలు జరిగితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతోందన్నారు. జనవరిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కంగుంది బౌల్డింగ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా కుప్పం ప్రాంతం సస్యశ్యామలమైందని ఏడాది పొడవున రైతులు పంటలు వేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. 100 చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని, బోర్లు మళ్ళీ రీఛార్జ్ అవడంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీకే ఉడా చైర్మన్ డాక్టరు సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, కాణిపాకం డైరెక్టర్ వసంతమ్మ, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్ జిమ్ దాము,రెస్కో డైరెక్టర్ అనసూయ,నడుమురు సర్పంచ్ సంతోష్, కొత్త పేట ఇన్‌చార్జ్ అప్పు, నాయకులు వేణు,ప్రసాద్, పాల్గొన్నారు.

గంజాయి, గుట్కా, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎస్ఐ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తేజశ్వని

ప్రజాశక్తి -కార్వేటినగరం: గంజాయి, గుట్కా, డ్రగ్స్ బారిన పడకుండా ప్రజలు దూరంగా ఉండాలని ఎస్ఐ తేజశ్వని అన్నారు. గురువారం మండల పరిధిలోని కొట్టార్వేడు గుండ్ల దళితవాడలో సారా అక్రమ వ్యాపారాలు, బాల్య వివాహాల అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ వ్యాపారాలకు స్వస్తి చెప్పి సమాజంలో గౌరవంగా జీవించడానికి అలవాటు పడాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పోయి సారా తయారీలు, అమ్మకాలు వంటి కార్యకలాపాలకు పాల్పడి పోలీసు కేసుల్లో చిక్కుకోవడమే కాకుండా మద్యానికి బానిసలై చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయి కుటుంబాలను వీధిన పడేయొద్దని సూచించారు. అతి చిన్న వయస్సులో పిల్లలకు వివాహాలు చేయడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని గుర్తు చేశారు. సారా అమ్మ కాలు, తయారీలు, అక్రమ మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో రహదారిపై దట్టంగా కప్పేసిన పొగమంచు

కప్పేసిన పొగ మంచు!

- ఎనిమిది గంటలైనా బయటకురాని రైతులు, కూలీలు
- వాహన చోదకులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గ్రామాలలో పొగ మంచు కప్పేయడంతో ఉదయం ఎనిమిది గంటలైనా కూలీలు, రైతులు ఇంటికే పరిమిత మవు తున్నారు. ముఖ్యంగా పట్టణా లకు వెళ్లే విద్యార్థులు సైతం సమయానికి పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారు. గతంలో రైతులు ఉదయం 6 గంటలకి వ్యవసాయ పనులకు కూలీలతో పాటు వెళ్లేవారు. ఇటీవల పొగ మంచు ఎక్కువ కావడంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు.

సోమల: వీడని పొగ మంచు విపరీతమైన చలి కారణంగా ప్రజలు చలి లో ప్రజలు ఉదయం చలి మంటలు వేసుకుని మంట వేడిని వెచ్చదనాన్ని పొందుతున్నారు. మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది విపరీతమైన చలి వేస్తూ ఉండడంతో ప్రజలు చలికి ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా సూర్య కిరణాలు నేలను తాకనీయకుండా పొగ మంచు కురుస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. రాత్రి వేళల్లో కూడా చలి తీవ్రత ఎక్కువగానే ఉంటోంది. ఎంతో ప్రజలు చలిమంటలు వేసుకుని చలి నుండి ఉపశమనం పొందుతున్నారు.

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రం నుంచి పుంగనూరు వైపు వెళ్లే జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజాము నుండి ఉదయం 7.45 గంటల సమయంలో గాఢమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, లారీలు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల దూరం పూర్తిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళల్లో రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని సిఎస్ఐ (ఓల్డ్) చర్చ్‌లో కొత్త సిఎస్ఐ చర్చి, శ్రీనగర్ కాలనీలోని క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి స్థానిక టీడీపీ నేతలతో కలిసి పాల్గొన్నారు. మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎలిజర్, మున్సిపల్ కౌన్సిలర్ సునీతా నాగరాజు స్వగృహాల వేడుకల్లో సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవ సోదరులతో కలిసి కేకులను కట్ చేసి అందరికీ పంచిపెట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, కుట్టి, గిరి బాబు, సుబ్రహ్మణ్యం గౌడు, ఖాజా, కృష్ణమూర్తి గౌడు, రూపేష్, మదన్, శ్రీధర్, సుధాకర్, రమేష్, సురేష్, చిన్నీ, సుబ్బు, శీనా జనసేన నాయకులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : నియోజకవర్గంలో క్రిస్మస్ నిర్వహిస్తున్న అందరికీ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని పలు చర్చిల్లో ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. చిత్తూరు చర్చి వీధిలోని ప్రధాన చర్చి క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే, స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు రూ.50.50 కోట్ల గౌరవ వేతన బకాయిలను విడుదల చేసిందన్నారు. నగర మేయర్ అముద 11వ డివిజన్ కార్పొరేటర్ అశోక్ కుమార్ నివాసాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.


గంగాధర నెల్లూరులో

గంగాధర నెల్లూరు: ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గం అని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు అన్నారు. మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ, అగ్రహారం దళితవాడలో చర్చి ఉపదేశకులు జీవరత్నం చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపన్యాసం చేశారు. భారీ కేక్ ను కట్ చేసి పంచిపెట్టారు. చర్చి మణి మండపానికి పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు పదివేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, చర్చి ఉపదేశకులు జీవరత్నం, చర్చి సభ్ మనగర్ సుబ్బా, టిడిపి నాయకులు బాబు నాయుడు, పద కుమార్ పలువురు గ్రామస్తులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు భారీ ఎత్తున కేకులు కోసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు మాసిలామని, చరణ్ పాల్గొన్నారు.

పుంగనూరు: స్థానిక సీఎస్ఐ చర్చ వద్ద నిరుపేదలు, యాచకులకు 150 మందికి గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నానబాల గణేష్, రాజారెడ్డి, అనిల్ కుమార్, అసిస్టెంట్ గవర్నర్ భాస్కర్ జెట్టి, ఎన్ వేణుగోపాల్, ఈస్. భాస్కర్, డాక్టర్ పూల ప్రభాకర్, డాక్టర్ శరణ్ కుమార్, మల్లెల సుధాకర్ రెడ్డి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల పరిధిలోని బీసీ కాలనీ బేతేల్ షారోన్ చర్చిలో ఫాస్టర్ ఆశీర్వాధం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్చేసి పంచిపెట్టారు. అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ తేజశ్విని హాజరయ్యారు. చర్చిలో ఏర్పాటు చేసి సాంస్కృతికి కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకుంది. రెండు వందల మంది పేదలకు చీరలను ఎస్ఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బాబు, పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

చౌడేపల్లి: క్రిస్మస్‌ను పురస్కరించుకొని చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన వెంకటరమణ దాదాపు 250 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. గత 20 సంవత్సరాలుగా ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూల రెడ్డమ్మ, వెంకటరమణ కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


ఎస్ ఆర్ పురంలో

ఎస్ ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లిమిట్ట లోని క్యాథలిక్ చర్చి లో వస్త్ర , అన్నదానం ఘనంగా నిర్వహించారు. కటికపల్లి , బడ్డు పల్లి ,డీకే మర్రిపల్లి, ఎస్ఆర్ పురం, పుల్లూరు, వెంకటాపురం, పిళ్ళారికుప్పం, ముద్దికుప్పం, చొక్క మడుగు, మంగుంట , తయ్యూరు, వివిధ గ్రామాలలో క్రిస్మస్ సందర్భంగా చర్చి ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన పూరి పాక లో యేసు క్రీస్తు జననం నమూనా బొమ్మలతో తయారు చేసి , చర్చిలు చాలా అందంగా విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు.

పెద్దపంజాణి: మండలంలోని క్రైస్తవులు స్థానిక చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాడి,రాజుపల్లి, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతికి సూచకంగా ఏసుప్రభు జన్మించారని పాస్టర్ శ్యాముల్ అన్నారు.

సోమల: మండలంలోని పలు చర్చిల లో క్రైస్తవులు ప్రార్థనలు చేసి బైబిల్ చదివి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. సోమల, కందూరు, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి, మేటి మంద గ్రామాలలోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదానం చేశారు.

పుంగనూరు: మండలంలోని మార్లపల్లెలో చర్చిలో ప్రార్థనలు చేశారు. పట్టణంలో సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో ఫాస్టర్ రాకేష్‌నిప్రోద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. పేదలకు అన్నదానం, నగదు పంపిణీ చేశారు. క్రైస్తవ సోదరులకు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

రామకుప్పం: బల్ల, వీర్నమల, గెరిగిపల్లి, రామ కుప్పంలోని హోలీ చర్చ్ లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి బైబిల్ లోని ముఖ్య అంశాలను బోధించారు. కేక్ కత్తిరించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని క్రైస్తవులు స్థానిక చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. శివాడి,రాజుపల్లి, మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో గ్రామాల్లోని ప్రజలు పాల్గొన్నారు.

కుప్పం: కుప్పంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పం పట్టణంలోని చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం ఉడా చైర్మన్ డాక్టరు సురేష్‌బాబు పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు స్వీట్లు పంచిపెట్టారు. పలు చోట్ల ఎమ్మెల్సీ శ్రీకాంత్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ హాజరయ్యారు.


కుప్పంలో

క్రైం న్యూస్

స్కూటర్ ఢీకొని వృద్ధుడి మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: తిరుమలకు పాదయాత్ర కోసం వెళుతూ స్కూటర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పుంగనూరు మండలం ప్రసన్నయ్య గారి పల్లికి చెందిన గుండ్లపల్లి శ్రీరాములు (62) భక్తుల సహకారంతో తిరుమలకు పాదయాత్ర కోసం బయలుదేరాడు. ఈ క్రమంలో పెద్ద ఇళ్ళకుంట్ల దాటగానే చౌడేపల్లి పుంగనూరు ప్రధాన రహదారిలో వెనుకవైపు నుంచి వస్తున్న టూవీలర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన వృద్ధుడు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: సీఐ

ప్రజాశక్తి- పలమనేరు : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పలమనేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి సూచించారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. తమ కోసం ఇంటి వద్ద కుటుంబ సభ్యులు వేచి ఉంటారని విషయం మరవకూడదన్నారు. పలమనేరు అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం పలమనేరు అర్బన్ పిఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సి లోకేష్ రెడ్డి, సిబ్బందితో కలిసి ఆటోలో మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు.

టిడిపి జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా మైఖేల్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడిగా మైఖేల్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా గురువారం మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత జిల్లా ఉపాధ్యక్షుడు మైఖేల్ చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. మైఖేల్ మాట్లాడుతూ..పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పటికైనా న్యాయం దక్కుతుందనడానికి నిదర్శనమే తనకు ఉపాధ్యక్ష పదవి దక్కిందన్నారు. పలువురు పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ కుమార్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు లెక్కలపై పట్టు సాధించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : విద్యార్థులు చిన్నవయసు నుంచే లెక్కలపై పట్టు సాధించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు నిచ్చారు. కొంగారెడ్డిపల్లిలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన సిప్ అబాకస్ గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అబాకస్ ద్వారా మ్యాథమెటిక్స్ లో మెళకువలు నేర్చుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, సిప్ అబాకస్ సంస్థ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పూర్ణిమ



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం : మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు తరుగు బాబు సతీమణి తరుగు పూర్ణిమను చిత్తూరు జిల్లా పార్లమెంటరీ టిడిపి సెక్రటరీగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌కు, ఆ పార్టీ మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడులకు తరుగు బాబు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తరుగు పూర్ణిమ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు టిడిపి బలోపేతానికి శక్తి వంచన లేక కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన జిల్లా నియోజకవర్గ మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


దేవన్న వాసు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దపంజాణి:
మండలంలోని ముదరం పల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు గణపతి నాయుడు ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మృతి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గణపతి, ఆకులవారి పల్లికి చెందిన మునిరత్నం రెడ్డిల చిత్ర పటాలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబీకులను పరామర్శించి అన్ని రకాలుగా అండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు. అప్పినపల్లికి చెందిన దేవన్న వాసు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు మురహరి రెడ్డి, శ్రీ రాములు, రామకృష్ణ, భాను ప్రతాప్ రెడ్డి, వేమా రెడ్డి, నాగరాజు, హరినాథ్, గుణ, గజేంద్ర, సతీష్, చందు, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.


రవియాదవ్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

రవియాదవ్‌కు పలువురు అభినందనలు

ప్రజాశక్తి- కార్వేటినగరం :
చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మేళం రవియాదవ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. తనను చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌కు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మరాజుల గుడి ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి రవి యాదవ్‌ను ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి జిల్లా స్థాయి కి ఎదగడం సంతోషకరంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ద్రౌపది ధర్మరాజుల ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


గువ్వల రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గువ్వల రమేష్ రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండల టిడిపి అధ్యక్షుడిగా ఐవిఆర్ఎస్ ద్వారా ఎన్నికైన భువన రమేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. బోయకొండ గంగమ్మ ఆలయ దర్శనానికి వెళ్లిన ఆయనకు అరుదైన సన్మానం అభిమానుల నుంచి లభించింది. టిడిపిని కష్టకాలంలో అన్ని విధాల ఆదుకున్న ఘనత గువ్వల రమేష్ రెడ్డికి దక్కిందని, సీనియర్ నాయకుడు జన్నే సుబ్రహ్మణ్యం నాయుడు మంచికి మారుపేరుగా నిలిచిన గువ్వల రమేష్ రెడ్డి పార్టీలో మరిన్ని పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, సోమశేఖర్, పాలెం రెడ్డి, పవన్ కుమార్, అర్జున్ , రాయల్ గిరి నాయుడు, ప్రభాకర్, బోయకొండ పరిసర ప్రాంతాల్లోని టిడిపి నాయకులు గువ్వల రమేష్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.


టికెట్ కౌంటర్‌ను ప్రారంభించిన ఫారెస్టు అధికారులు

నగరవనంలో టికెట్ కౌంటర్ ప్రారంభం


ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం ముడివారిపల్లి తోపు వద్ద ఫారెస్ట్ వారు సుందరంగా ఏర్పాటు చేసిన పార్కులో టికెట్ కౌంటర్‌ను పలమనేరు ఎఫ్ఆర్‌వో నారాయణ గురువారం ప్రారంభించారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటలు వరకు, సాయంత్రం మూడు నుంచి 6 గంటలు వరకు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటుందని తెలిపారు. ఏడు సంవత్సరాలు పైబడిన వారికి ఒకరికి టికెట్ 20 రూపాయలు ఫీజు చెల్లించాలన్నారు. ఈ నగర వనానికి పలమనేరు నుంచి రెండు కిలోమీటర్లు, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నుంచి కూర్మయికి వెళ్లే దారి మధ్యలో వస్తుందని తెలిపారు. ఆసక్తి వున్న వారు వెళ్లవచ్చని అటవీ అధికారులు తెలిపారు.


అన్నదానం చేస్తున్న భక్తులు

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాలెం: మండలంలోని మొగిలి వెంకటగిరిలో ఓం శక్తి భక్తులకు గురువారం అన్నదానం చేశారు. నూతనంగా నిర్మించిన ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి ఓం శక్తి భక్తుల వద్ద అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో ఓం శక్తి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణానికి సహకరించిన దశరధ రామ పిళ్లై, గురుశక్తి మహాలక్ష్మి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నరసింహులుకు నివాళులు



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న శనిపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలు తండ్రి నరసింహులు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ రాజారెడ్డి అలియాస్ చంద్రమౌళి ఎంపీటీసీ వినాయక , వార్డు మెంబర్లతో కలిసి శనిపల్లి గ్రామానికి చేరుకున్నారు. నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నరసింహులు మృతి గ్రామానికి తీరని లోటని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు, విలేకరులు పాల్గొని నరసింహులు మృతికి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వైసిపి కార్యకర్తల కుటుంబాలకు ఓదార్పు

ప్రజాశక్తి -విజయపురం: అయిన వాళ్లను పోగొట్టుకున్న పార్టీ నేతలకు, ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న వారిని, అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతున్న వారిని మాజీ మంత్రి ఆర్కె రోజా గురువారం పరామర్శించారు. తానున్నానని దిగులు పడాల్సిన అవసరం లేదంటూ భరోసా ఇచ్చారు. విజయపురం మండలం మహారాజు పురం గ్రామంలో వైసీపీ కార్యదర్శి కోట ఆనంద్ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కోసల నగరంలో ఇటీవల మృతి చెందిన వైసిపి కార్యదర్శి నాగయ్య, కార్యకర్తల మునెమ్మల కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయపురం దళితవాడలో ఆ పార్టీ కార్యదర్శి ప్రదీప్ తండ్రి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆలపాక కండ్రిగలో వైసిపి నాయకులు నారాయణరెడ్డి భార్య ఆకస్మికంగా చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


వైసిపి కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కె రోజా

వాట్సాప్‌లోనే ఆర్‌టిసి బస్ టికెట్ బుకింగ్: డిఎం

ప్రజాశక్తి-పలమనేరు: వాట్సాప్‌లోనే ఆర్‌టిసి బస్ టికెట్స్ బుకింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసిందని పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్ బాషా తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బస్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే కౌంటర్ల వద్ద నిలబడే అవసరం లేదన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 ద్వారా సులభంగా టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఇంటి వద్దకి డోర్ డెలివరీ చేసే విధంగా ఏపీఎస్ ఆర్టీసీ తమ కార్గో సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తోందన్నారు. మూడేళ్లుగా ఇంటి వద్దకే కొరియర్‌లు, పార్సిల్‌లు అందించే డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నా, చాలా మందికి దీనిపై అవగాహన లేదన్నారు. ఈ సేవలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు, డిసెంబరు 20 నుంచి ఒక నెల రోజుల పాటు డోర్ డెలివరీ మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రజలకు డోర్ డెలివరీ సేవలు ఎలా ఉపయోగపడతాయో, ఎలా బుక్ చేసుకోవాలో వివరించనున్నారు.. ప్రయాణికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రాజంపేట పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెడ్డప్ప నాయుడు

ప్రజాశక్తి -పుంగనూరు: రాజంపేట పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పుంగనూరు నియోజకవర్గానికి చెందిన పాలడుగు రెడ్డప్ప నాయుడును నియమించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వనమలదిన్ని గ్రామానికి చెందిన తనకు ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత 30 సంవత్సరాలుగా పార్టీకి విధేయుడుగా ఉంటూ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా, క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పార్టీకి విశేష సేవలు అందించినట్లు చెప్పారు. పార్టీకి కష్ట కాలంలోనూ పార్టీకి నిజాయితీగా సేవలం దించానన్నారు. పార్టీ గుర్తించి ఈ పదవి ఇచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పార్టీ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబు రెడ్డికి, ముఖ్యమంత్రి చంద్ర బాబు కు , రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు, పుంగనూరు నియోజక వర్గ టిడిపి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అంతర్ పంటలతో అధిక దిగుబడులు


- రైతులు డిమాండు పంటలు సాగు చేయాలి
-ఏఎంసీ చైర్మన్ రాజు

ప్రజాశక్తి -కుప్పం : రైతులు వివిధ అంతర్ పంటలు సాగు చేయడం వల్ల అధిక లాభాలను పొందవచ్చని కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. కుప్పం మండలం ఊర్ల ఓబనపల్లి గ్రామంలో రైతు భాషా సాగు చేస్తున్న అంతర్ పంటలను గురువారం ఆయన పరిశీలించారు. రూ.20 వేలు సాగు చేసి వివిధ అంతర్ పంటలు వేయగా దాని ద్వారా సుమారు 80 వేలు లాభం వస్తుందని రైతు పేర్కొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రైతులు డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేస్తే మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రైతు బాషా సాగు చేస్తున్న పంటలను చెన్నైకు మార్కెటింగ్ చేస్తున్నారని అయితే కుప్పంలోనే మార్కెటింగ్ చేసుకునే వ్యక్తులు బాటు త్వరలోనే కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తులసి రైతులు పాల్గొన్నారు.



గ్రామాల్లో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు

ప్రజాశక్తి-రామకుప్పం: సీఎం చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయనున్నట్లు టిడిపి యూనిట్ ఇన్‌చార్జ్, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జయశంకర్ గురువారం పేర్కొ న్నారు. రామకుప్పం మండలం, ఉన్సిగానిపల్లి గ్రామ పంచాయతీ లోని గ్రామాల్లోని వీదులలో ఆటోమేటిక్ సెన్సర్ ఎల్ఈడి బల్బులు అమర్చనున్నట్లు పేర్కొన్నారు. కుప్పం కడ ప్రత్యేక నిధులతో వీటిని ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపార. ప్రభుత్వం అందించిన ఈ ఆటోల ద్వారా గ్రామాల్లోని పొడి, తడి చెత్తలను సేకరించి పారిశుధ్యం పనులు మెరుగు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రప్ప, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మనేష్,మహేంద్ర నాయుడు ,క్లస్టర్ కో ఇన్‌చార్జ్ శంకరచలం, రామలింగం, స్థానికులు పాల్గొన్నారు.




సుడిగాలి పర్యటన చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


పెద్దిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -సోమల: పుంగనూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమల మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పెద్దిరెడ్డి రాక సందర్భంగా వైసీపీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పల్లె పల్లెలో ఆయనకు ప్రజలు హారతులు పట్టారు. రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి కూడా మాజీ మంత్రి వెంట సుడిగాలి పర్యటన చేయగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. వైసిపి కార్యకర్తల ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపి మిధున్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన జరుగుతోందని అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తూ లక్షల కోట్ల రూపాయల అప్పు తీస్తూ ప్రజలపై భారాన్ని మోపుతున్నారని సంక్షేమ పథకాలు ఎక్కడా అమలుకు నోచుకోలేదని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులు కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తూ కేసులు పెడుతూ అరెస్టు చేస్తూ ప్రజలలో భయాందోళనలను కలిగిస్తున్నారని ప్రజలు ప్రభుత్వ అరాచకాలను గమనిస్తూ ఉన్నారని త్వరలోనే ఓటుతో బుద్ధి చెప్తారని అన్నారు. అనంతరం అటు ఎంపీ ఇటు ఎమ్మెల్యేకు ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్య క్రమంలో మండల ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభల నిర్వహణ

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని 19 పంచాయతీలలో శుక్రవారం వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్(ఉపాధి హామీ) పై గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధా రాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పేరును మార్చి కొత్త పేరు సూచించి నూతన విధివిధానాలను పార్లమెంటులో ఆమోదింపజేసిన సందర్భంగా ప్రజలకు నూతన అంశాలపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో దీర్ఘకాలిక ఆస్తులు కల్పించబడటం, నూరు రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం, జల సంరక్షణ పనులు, గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి కల్పించే వసతులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులు చేపట్టడం తదితర అంశాలు ప్రజలకు తెలియజేసి గ్రామసభల నిర్వహణ జరుగుతుందని ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. గ్రామ సభలలో ప్రజలు రైతులు కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యాన్నదానం ట్రస్ట్‌కి విరాళం



ప్రజాశక్తి -ఐరాల: శ్రీ స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానానికి విరాళం - 1,00,116 రూపాయలు చెక్కును తవణంపల్లి మండలం తెల్లగుండ్లపల్లికి చెందిన దాత లోకేశ్వరి, కుప్పుస్వామి నాయుడు అందించారు. పులివెందుల, కడప, వాస్తవ్యులు లక్ష్మీదేవి శ్రీ స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానానికి 1,00,116 రూపాయలు విరాళం, చిత్తూరు జిల్లా లక్ష్మయ్య కండ్రిగకు చెందిన షణ్ముఖ పౌల్ట్రీ ఫార్మ్స్ పూల జయలక్ష్మి ,సుబ్రహ్మణ్యం స్వామి వారి దేవస్థానం వినాయక సదన్ వసతి సముదాయానికి రూ.9,50,000 విరాళం అందించారు. వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు దేవస్థానం చైర్మన్ మణి నాయుడు కల్పించారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.